

ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ.4 లక్షలు సీజ్

గార, మార్చి 29: మండలంలోని తూలుగు జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ నిర్వహించిన తనిఖీల్లో ఓ ద్విచక్ర వాహనంలో తీసుకు వెళుతున్న రూ.4.04 లక్షల నగదు సీజ్ చేసినట్లు తహసీల్దార్ కె.కృష్ణ తెలిపారు. కొమరవానిపేటకు చెందిన పుక్కళ్ల అనిల్‌కుమార్ తన ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం రజని ఆధ్వర్యంలో తనిఖీ చేయగా నగదు పట్టుబడింది. ఈ నగదుకు ఎటువంటి కాగితాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎఫ్ఎస్‌టీ అధికారి ఇచ్చిన వివరాల మేరకు ఈ విషయాన్ని జిల్లా సీజర్స్ టీమ్‌కు తెలియజేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

టీడీపీ జెండా.. పేదలకు అండ

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
- ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

టెక్కలి, మార్చి 29: తెలుగుదేశం పార్టీ జెండా పేదలకు అండ అని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేయడంతో పాటు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి 42 వసంతాలు పూర్తిచేసుకుందని అన్నారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ అందించాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ పేదల పక్షాన ఉంటూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కింజరాపు హరిప్రసాద్, బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, నంబాళ్ల శ్రీనివాస్, వెలమల విజయలక్ష్మి, పూజారి శైలజ, కర్రి అప్పారావు, ఆనంద్ తదితరులు ఉన్నారు.

సీఎం జగన్ దగాకోరు..

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఓ దగాకోరని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడ కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి కోటబొమ్మాళిలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప జిల్లాలో జరిగిన సిద్ధం సభలో చంద్రబాబు తమ చెల్లెళ్లను రెచ్చగొట్టారంటూ జగన్ సిగ్గులేకుండా అంటున్నార న్నారు. వివేకా హత్యలో ప్రధాన భూమిక పోషించిన వారిని పక్కన పెట్టుకుని ఒక ముఖ్యమంత్రి ఇంత దారుణంగా మాట్లాడుతుంటే ప్రజానీకానికి ఏమిరక్షణ ఉంటుందని ప్రశ్నించారు.



కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ జెండా ఎగురవేస్తున్న అచ్చెన్నాయుడు

సిక్కోలు నేతలు పక్క జిల్లాకు

- విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థిగా కలిశెట్టి
- కళా వెంకటరావుకు చీపురుపల్లి అసెంబ్లీ టిక్కెట్
- ప్రకటించిన అధిష్ఠానం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సిక్కోలులో కీలకంగా వ్యవహరించిన తెలుగుదేశం పార్టీ నాయకులు పొత్తుల నేపథ్యంలో పక్క జిల్లాలో పోటీకి దిగుతున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడును విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా అధిష్ఠానం శుక్రవారం ఖరారు చేసింది. ఈయన ఎచ్చెర్ల నియోజకవర్గ అసెంబ్లీ సీటును ఆశించారు. అయితే, పొత్తుల కారణంగా బీజేపీకి ఎచ్చెర్ల సీటును కేటాయించారు. ఇక్కడ నుంచి విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. దీంతో విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా కలిశెట్టిని అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని ఎచ్చెర్ల నియోజకవర్గం ఉంది.

బొత్సకు దీటుగా కళా..

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు కూడా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచే పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే, ఆయన బలమైన నేత కావడంతో చీపురుపల్లిలో మంత్రి బొత్సపై పోటీకి నిలబెట్టాలని అధిష్ఠానం భావించింది. ఈ మేరకు పలు దఫాలు సర్వేలు నిర్వహించింది. సర్వేలు అనుకూలంగా రావడంతో కళా వెంకటరావుకు చీపురుపల్లి సీటును కేటాయించింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కలిశెట్టి అప్పలనాయుడు, కిమిడి కళావెంకటరావు పక్క జిల్లాలో పోటీకి దిగుతుండడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



కలిశెట్టి అప్పలనాయుడు

కిమిడి కళావెంకటరావు

మట్టి తరలింపుపై రగడ

- అనుమతి లేదంటూ వాహనాల అడ్డగింత
- పోర్టు యాజమాన్యం, కాంట్రాక్టర్ మధ్య వివాదం

టెక్కలి, మార్చి 29: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు అవసరమైన మట్టి తరలింపుపై రగడ చోటుచేసుకుంది. మట్టి తరలింపునకు అనుమతి లేదంటూ పోర్టు యాజమాన్యం ఓ కాంట్రాక్టర్‌కు చెందిన వాహనాలను అడ్డుకుంది. దీంతో పోర్టు యాజమాన్యానికి, కాంట్రాక్టర్ మధ్య వివాదం ఏర్పడింది. టెక్కలి సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీ ప్రాంతం నుంచి శుక్రవారం మధ్యాహ్నం జీటీఆర్ అనే కాంట్రాక్టర్ టిప్పర్లతో మట్టిని మూలపేట పోర్టుకు తీసుకెళ్తుండగా వర్క్‌ఆర్డర్ లేదంటూ పోర్టు యాజమాన్యం అడ్డుకుంది. తనకు వర్క్‌ఆర్డర్ ఉండడంతోనే మట్టిని పోర్టుకు తరలిస్తున్నానని, కావాలనే పోర్టు యాజమాన్యం తనను అడ్డుకుంటుందని సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డుపై తన వాహనాలను అడ్డంగా నిలిపివేశాడు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది. చివరికి శుక్రవారం సాయంత్రం నాటికి కాంట్రాక్టర్ తన వద్ద ఉన్న వర్క్ ఆర్డర్‌ను చూపడంతో పోర్టు యాజమాన్యం మట్టి వాహనాలను విడిచిపెట్టింది. దీంతో ఈ వివాదం సద్దుమణిగింది.



టెక్కలి సమీపంలో నిలిచిన మట్టి టిప్పర్లు

బాబోయ్ ఎండలు

- వారం రోజుల నుంచి వడగాల్పులు
- మూడు మండలాల్లో 41 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత



నిర్మానుష్యంగా మారిన రొట్టవలస రహదారి



ఆమదాలవలస మార్కెట్ వద్ద గొడుగులు వేసుకుని ప్రయాణిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం(ఆంధ్రజ్యోతి)/ఆమదాలవలస/సరుబుజ్జిలి: వేసవి ఆరంభంలోనే భానుడు భగ్గుమంటున్నాడు. గత కొద్దిరోజుల నుంచి జిల్లాలో ఎండ తీవ్రత పెరుగుతోంది. మార్చిలోనే ఇలా ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏంటని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వారం రోజుల నుంచి వడగాల్పులు ఆరంభమయ్యాయి. శుక్రవారం ఎల్ఎన్‌పేట, బూర్జ, హిరమండలాల్లో 41 డిగ్రీల సెంటీగ్రేడ్ పైబడి ఉష్ణోగ్రత నమోదైంది. వడగాలులు కూడా వీచాయి. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే రొట్టవలస, ఆమదాలవలస తదితర ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు గొడుగులు వేసుకొని ప్రయాణాలు సాగించారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు కొందరు కూల్‌డ్రింక్స్, పండ్ల రసాలు, తదితర పానియాలు తాగారు. ఆమదాల వలసలోని మెట్టక్కివలస వద్ద కంద్రవీధికి చెందిన ఓ వృదుడు ప్రధాన రహదారిపై నడుస్తూ ఎండ తీవ్రతను తట్టుకోలేక సొమ్మసిల్లిపడిపోయాడు. స్థానికులు తక్షణమే స్పందించి ఆయన్ను నీడలోకి తీసుకెళ్లి సపర్యలు చేశారు.



మెట్టక్కివలస వద్ద వడదెబ్బకు గురైన వృద్ధుడికి సపర్యలు చేస్తున్న స్థానికులు

కరుణామయుడు ఏసు

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు



శ్రీకాకుళంలో శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు



శిలువ మోస్తున్న భక్తుడు



ఇచ్ఛాపురం: ఏబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు

జిల్లాలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం, ఇచ్ఛాపురం, టెక్కలి, ఎచ్చెర్ల, పలాసలోని చర్చిల్లో క్రైస్తవులు సామూహిక ప్రార్థనలు చేశారు. కరుణామయుడు ఏసు అని కీర్తించారు. శ్రీకాకుళం నగరంలో శిలువ యాత్ర చేపట్టారు. పురుషుల డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న వర్షిప్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తులు.. శిలువ మార్గంలో ఏసుక్రీస్తు పడిన శ్రమల పాట్లను వివిధ వేషధారణలతో కళ్లకు కట్టినట్టు చూపించారు. ఈ యాత్ర డే అండ్ నైట్ జంక్షన్ నుంచి రైతుబజార్, సూర్యమహల్ జంక్షన్, ఏడు రోడ్ల జంక్షన్ వరకు సాగింది. లోక కల్యాణం కోసం శిలువపై మరణించిన ఏసు ప్రభువును స్మరిస్తూ ఉపవాస ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రేమ తత్వాన్ని ప్రచారం చేశారు. భక్తి గీతాలు ఆలపించారు. గుడ్‌ఫ్రైడే సందేశాన్ని పాస్టర్లు వినిపించారు. 'ఏసు ప్రభువు మన కోసమే జన్మించారని, మనందరి కోసం ప్రాణత్యాగం చేశారని, ఆయన రక్తం మనలను శుద్ధి చేస్తుందని' తెలిపారు. ప్రభు పలికిన ఏడు మాటలను, వాటి తత్వాన్ని, తాత్పర్యాన్ని వివరించారు.

-శ్రీకాకుళం కల్చరల్

మనీ రల్ వాటర్!

- శుద్ధజలం పేరుతో మాయాజాలం
- పుట్టగొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు
- కనీస ప్రమాణాలు కరువు
- ప్రజారోగ్యంతో చెలగాటం

(నరసన్నపేట, మార్చి 29)

జిల్లాలోని మినరల్ వాటర్ (శుద్ధ జలం) కేంద్రాల నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారం ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించకుండా, నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేయకుండా విక్రయిస్తూ ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు. ఎలాంటి అనుమతులు, ఐఎస్ఐ గుర్తింపు లేకుండా రోజుకు లక్షల లీటర్ల నీటిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. నీటి కేంద్రాల నిర్వాహకుల నుంచి భారీగా నజరానాలు ముట్టడమే దీనికి కారణమనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంటింటా కుళాయిలను ఏర్పాటు చేసింది. అనేక చోట్ల పనులు పూర్తికాకపోవడంతో పట్టణాలతో పాటు గ్రామాల్లో కూడా శుద్ధ జలాన్ని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మినరల్ వాటర్‌కు డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు ఈ ఏడాది మార్చిలోనే ఎండలు మండుతుండడంతో తాగునీటి వనరులు అడుగంటుతున్నాయి. ప్రజలకు నీటి అవసరాలు పెరగడంతో మినరల్ వాటర్ అమ్మకాలు ఊపందుకున్నాయి. మరోక వైపు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ షాపుల్లో వాటర్ బాటిళ్లు, ప్యాకెట్ల ద్వారా నీటి విక్రయాలు చేయడంతో వీటి డిమాండ్ అమాంతగా పెరిగింది. దీన్ని ఆసరా చేసుకొని ఆయా కేంద్రాల నిర్వాహకులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. కనీస జాగ్రత్తలు పాటించకుండా నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేయకుండా అమ్ముతూ ప్రజలను దోచుకుంటున్నారు.

విచ్చలవిడిగా ప్లాంట్‌లు..

జిల్లాలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఆర్వో ప్లాంట్లను విచ్చలవిడిగా కొందరు ఏర్పాటు చేస్తున్నారు. గృహ అవసరాల కోసమని బోర్లు ఏర్పాటు చేసుకొని వాటి నుంచి నీటిని ప్యూరిఫైయర్ ద్వారా శుద్ధి చేసి ట్యాంకర్లకు పంపుతున్నారు. కొందరు నేరుగా బోరు నీటినే క్యాన్లు, బాటిళ్లు, ప్యాకెట్లకు నింపుతున్నారు. క్యాను నీటిని రూ.20 నుంచి రూ.30 వరకూ అమ్ముతున్నారు. బాటిళ్లకు అందమైన స్టిక్కర్లను ఏర్పాటు చేస్తున్నారు. అర లీటరు, 200 మి.లీ, లీటర్ల బాటిళ్లను రూ.10 నుంచి రూ.20కు విక్రయిస్తున్నారు. కొందరు నిర్వాహకులు ట్యాంకర్ల ద్వారా నేరుగా ఇళ్లకే సరఫరా చేస్తున్నారు. ఒక్కో ప్లాంట్‌లో రోజుకు దాదాపు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా. ప్రభుత్వ నిబంధనలన్నీ పాటించి వాటర్ ప్లాంట్ చేయాలంటే రూ.30లక్షలకు పైగా ఖర్చవుతుంది. కానీ ప్రమాణాలు పాటించకుండా ఎక్కువ మంది రూ.5 నుంచి 7 లక్షలు మాత్రమే వెచ్చించి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 650 వరకు నీటి శుద్ధి కేంద్రాలు ఉండగా ఒకట్రెండు ప్లాంట్లకు మినహా మిగతా కేంద్రాలకు ఐఎస్ఐ గుర్తింపులేదు. మొదట్లో కొందరు తీసుకున్నా ఏటా రెన్యువల్ చేయడం లేదు.



అపరిశుభ్రంగా ఉన్న క్యాన్‌లు

ఇవీ నిబంధనలు..

నీటిని శుద్ధి చేయాలంటే తొలుత ఇసుక ఫిల్టర్‌లోకి, అనంతరం కార్బన్ ఫిల్టర్‌లోకి పంపాలి. అక్కడ శుద్ధి చేసిన అనంతరం సాఫ్టనర్‌లోకి పంపి తర్వాత రెండు ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేసి ఆర్వోప్లాంట్‌కు చేర్చాలి. అక్కడ నుంచి రివర్స్ ఆస్మోసిస్ ద్వారా యూఎస్‌ఏ ల్యాంప్‌నకు పంపి స్టెరిలైజేషన్ అనంతరం ఓజోనైజేషన్ చేయాలి. తర్వాత నీటిని ట్యాంకులకు నింపాలి. అక్కడ నీటిని 24 గంటల వరకు నిల్వ ఉంచిన తర్వాత వినియోగించాలి. ప్లాంట్ చుట్టూ పరిశుభ్రమైన వాతావరణం ఉండాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆహార భద్రత అధికారులు ప్లాంట్‌ను తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాల్సి ఉంది. వాటర్ ప్లాంట్‌కు ఐఎస్ఐ అను మతి తప్పనిసరి. ప్రాథమిక అనుమతి కోసమే రూ.3లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి సంవత్సరం రూ.89వేలు కట్టి రెన్యూవల్ చేసుకోవాలి. ప్రతి కేంద్రంలోనూ నీటి పరీక్షల కోసం మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ ల్యాబ్‌లు, ఏసీ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి. కానీ జిల్లాలో ఒకట్రెండు చోట్ల తప్ప ఎక్కడా ప్రమాణాలు పాటించడం లేదు.



ఓ ప్లాంట్‌లో నేరుగా క్యాన్‌లకు నీరు నింపుతున్న దృశ్యం

కానరాని తనిఖీలు..

తాగునీటి ప్లాంట్లను ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. గతంలో మేజర్ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరుతో ప్రత్యేక అధికారులు ఉండేవారు. ఆ బాధ్యతల నుంచి వారిని తప్పించి ఆహార భద్రత అధికారులకు అప్పగించారు. అయితే వారు మినరల్ వాటర్ ప్లాంట్లలోని లోపాలపై కనీస దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిర్వాహకుల నుంచి అంతో ఇంతో పుచ్చుకుని మిన్నకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై జిల్లా ఆహార కల్తీనియంత్రణ అధికారులకు సంప్రదించినా వారు స్పందించకపోవడం గమనార్హం.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరి మృతి

● ముగ్గురికి తీవ్ర గాయాలు


హేమలత(ఫైల్)


చెల్లాచెదురుగా పడిఉన్న ద్విచక్ర వాహనాలు

వజ్రపుకొత్తూరు: ధర్మపురం- రాజాం గ్రామాల మధ్య ఆర్ అండ్‌బీ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ సీహెచ్ రామారావు తెలిపిన వివరాల మేరకు.. కాశీబుగ్గ మార్కెట్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చిన మడ్డు హేమలత, అర్జాల నాగమణి తిరిగి స్వగ్రామం అక్కుపల్లి వైపు వస్తుండగా.. గరుడుభద్ర నుంచి కాశీబుగ్గ వైపు ద్విచక్రవాహనంపై కాస హృదయ్‌తోపాటు మరో యువకుడు వస్తూ ఢీకొన్నారు. ఈ ప్రమాందలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో పలాస ప్రభుత్వసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హేమలతను శ్రీకాకుళం తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఉపాధి కోసం ఇతర ప్రాంతంలో ఉంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్..


జనార్దనరావు (ఫైల్)

ఎల్ఎన్ పేట: మండలంలోని కరకవలస మాజీ సర్పంచ్, కుసుమలపాడు గ్రామానికి చెందిన బి.జనార్దనరావు(68) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. జనార్దనరావు గురువారం తమ బంధువుల ఇంట్లో జరిగిన శుభ కార్యక్రమానికి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ద్విచక్రవాహనంపై వెనుక కూర్చొని వెళ్లి తిరిగి వస్తుండగా తురకపేట జంక్షన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. తురకపేట జంక్షన్ నుంచి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పింది. దీంతో వెనుక కూర్చున్న జనార్దనరావు రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జనార్దనరావు ఎల్ఎన్ పేట పీఏసీఎస్ డైరెక్టర్‌గా సేవలందించారు. విషయం తెలుసుకున్న పలువురు శుక్రవారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ..


గుర్తుతెలియని మహిళ మృతదేహం

ఇచ్ఛాపురం: స్థానిక రైల్వే నిలయం సమీపాన చిదంబరేశ్వర ఆలయం వద్ద రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. శుక్రవారం వేకువ జామున ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని రైల్వే పోలీసులు అంచనా వేస్తున్నారు. సుమారు 56 ఏళ్ల వయస్సు గల ఆ మహిళ తలకి, శరీరంపై తీవ్ర గాయాలు ఉన్నాయి. పలాస జీఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ కేసు నమోదు చేశారు.

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ సీఐ


రామారావును రిమ్స్‌కు తరలిస్తున్న సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైం: ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం ఓ 55 ఏళ్ల వృద్ధుడికి అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బూర్జ గ్రామానికి చెందిన కంతాన రామారావు శ్రీకాకుళం నగరంలో తన భార్య ఇద్దరు పిల్లలతో జీవించేవాడు. అయితే ఇంట్లో సమస్యలతో అతడు 2018లో బయటకు వచ్చేసి రిక్షా తొక్కుకుంటూ అందులోనే పడుకుంటూ జీవిస్తున్నాడు. అయితే ఈ నెల 24న ఏడురోడ్ల కూడలి వద్ద ఉన్న బ్రిడ్జిపై గుర్తుతెలియని వాహనం రిక్షాను ఢీకొట్టింది. దీంతో అతడు తన జీవనాధారం పోగొట్టుకుని ఆకలితో అక్కడే ఉండిపోయాడు. 27వ తేదీన ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం బ్రిడ్జి మీదుగా వెళ్తూ రామారావు పరిస్థితిని గుర్తించారు. గాయపడిన అతడిని తన సిబ్బంది సాయంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అయితే చికిత్స తీసుకున్న తర్వాత అతడు శుక్రవారం బ్రిడ్జి మీద ఉన్న తన రిక్షా దగ్గరే కూర్చున్నాడు. విషయం తెలుసుకున్న సీఐ అక్కడికి చేరుకుని అతడిని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌కు తరలించి భోజన సౌకర్యం కల్పించారు. కొత్త రిక్షా ఇస్తానని, .అలాగే రెండు రోజులకు కావాల్సిన ఆహార పదార్థాలను రామారావుకి అందించారు. సీఐ అవతారం చూపిని చొరవకి స్థానికులు అభినందనలు తెలిపారు.

అలరించిన నాటికలు


నాటికలోని ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ కళామందిర్‌లో జరుగుతున్న నాటిక పోటీలు అలరిస్తున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు శుక్రవారం గోవాడ క్రియేషన్ హైదరాబాద్‌కి చెందిన వెంకట్ గోవా దర్శకత్వంలో సింహ ప్రసాద్ రచనలో 'మూల్యం' అనే నాటిక సందేశాత్మకంగా ప్రదర్శించారు. మహిళలు అగచాట్లు, సమాజంలో ఆడపిల్లలు మీద రకరకాల ఆంక్షలు విధింపబడటం, మహిళలకు చిన్న చూపుచూడడం వంటి ఘటనలను ఇతివృత్తంగా ఈ నాటిక ప్రదర్శించారు. అదే విధంగా శృంగార వల్లభ ఆర్ట్స్ తిరుపతి, కాకినాడకు చెందిన కోరుకొండ బ్రహ్మానందం దర్శకత్వంలో కొంతం కాశీ విశ్వనాథం రచనలో నేటి పరిస్థితుల్లో బడా నాయకులు భూమి, స్థలాలు ఏవిధంగా కబ్జా చేస్తున్నారో, మోసాలకు గురిచేస్తున్నారో ఇతివృత్తంగా కబ్జా నాటికను కళ్లకు కట్టినట్టు చూపించారు. శనివారం ఇంద్రప్రస్థం, పక్కింటి మొగుడు నాటికలు ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కలిశెట్టి ఇంటి వద్ద సంబరాలు


లోకేష్‌తో కలిశెట్టి కుటుంబ సభ్యులు

రణస్థలం: విజయనగరం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడును అధిష్ఠానం ప్రకటించడంతో శుక్రవారం కలిశెట్టి ఇంటి వద్ద టీడీపీ కార్యకర్తలు, నాయకులు, కలిశెట్టి అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు స్వీట్స్ తినిపించుకొని బాణసంచా కాల్చారు. తమ నాయకుడికి టీడీపీ నుంచి ఎంపీ టికెట్ ప్రకటించడం ఆనందగా ఉందన్నారు. చంద్రబాబుకు, లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సభ్యులతో మంగళగిరి లోని పార్టీ కార్యాలయంలో నారా లోకేష్‌ను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు.

సీతమ్మకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం: కేదారిపురం గ్రామానికి చెందిన జీరు సీతమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న కేదారిపురం గ్రామానికి చెందిన గల్ఫ్ ఫౌండేషన్ శుక్రవారం రూ.20 వేలు మెడికల్ ఖర్చుల కోసం ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, గల్ఫ్ యువత పాల్గొన్నారు.


శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణంలో..


ఆమదాలవలస: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు క్రీస్తు వేషధారణలతో గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


పాతపట్నం: జేసీపీఈఎం చర్చిలో..



ఇచ్ఛాపురం: ఏబీ చర్చి, ఈదుపురం చర్చిలో..

పెళ్లికి చెప్పడానికి వచ్చి..

● రోడ్డు ప్రమాదంలో వరుడు మృతి

● మరొకరి పరిస్థితి విషమం

● మృతుడిది శ్రీకాకుళం జిల్లా కొయ్యగండ

రేగిడి: బైక్, ఆటో ఢీకొన్న ఘటనలో పెళ్లికొడుకు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతపట్నం మండలం కొయ్యగండ గ్రామానికి చెందిన కనుతూరి షన్ముఖరావు(30)కు వచ్చే నెల 20వ తేదీన టెక్కలికి చెందిన యువతితో వివాహం కుదిరింది. ఇందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తన పెళ్లికి లగ్న పత్రికలు ఇచ్చేందుకు చిన్నాన్న నారాయణరావుతో కలిసి రాజాం బయలుదేరాడు. రాజాం మండలం అమరాంలో దగ్గర బంధువుల శుభకార్యానికి హాజరై భోజనం చేశారు. అనంతరం మరోదగ్గర బంధువు, వీరఘట్టాం మండలం కంబరవలసకు చెందిన వెంకటరమణతో కలిసి రాజాం పరిసర గ్రామాల్లో బంధుమిత్రులకు పెళ్లికార్డులు పంచి తిరుగుపయణమయ్యారు. రాజాం నుంచి పాలకొండ వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా లచ్చరాయపురం గ్రామం వద్ద ఎదురుగా పాలకొండ నుంచి రాజాం వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో పొలాల్లోకి దూసుకుపోయి బోల్తా పడగా, దిచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు కిందపడ్డారు. వీరిలో షన్ముఖరావు, నారాయణరావుకు తీవ్ర గాయాలు కాగా, వెనకకూర్చుని ఉన్న వెంకటరమణ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆటో డ్రైవర్ కోట వెంకటరమణ, మరో ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలయ్యాయి. వీరందరిని 108లో రాజాం ప్రభుత్వ ఆసపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ షన్ముఖరావు మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నారాయణరావును మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. షన్ముఖరావుది పేద కుటుంబం. ఈయన తండ్రి చిన్నతనంలో చనిపోగా, తల్లి రాజులమ్మతోనే కలిసి జీవిస్తున్నాడు. గ్రామ వలంటీర్‌గా, రైతు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి రేగిడి పోలీస్ స్టేషన్, రాజాం ఆసుపత్రికి చేరుకుని బోరున విలిపించారు. ఈ ఘటనపై రేగిడి ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


పొలాల్లోకి దూసుకుపోయిన ఆటో


షన్ముఖరావు(ఫైల్)

కూటమి విజయంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ


ఆమదాలవలస: మెట్టక్కివలసలో కూటమి నాయకులతో ర్యాలీ

ఆమదాలవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్య పరిరక్షణకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమిని గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమదాలవలస మున్సిపాలిటీ మెట్టకివలస మండలవీధి, గాంధీనగర్, హడ్కో కాలనీ ప్రాంతాల్లో బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, జనసేన కన్వీనర్ పేడాడ రామ్మోహన్‌తో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తమ్మినేని గీతసాగర్, బోర గోవిందరావు, తంగి గురయ్య, నాగళ్ల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 22వ వార్డు లక్ష్ముడుపేట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పేడాడ రామారావు, బిర్లంగి కోటేశ్వరరావు, గున్న పురుషోత్తమరావు, చింతాడ ఉదయ్‌కుమార్, పైడి రాజశేఖర్, తమ్మినేని రాము, సనపల చలపతిరావు తదితరులు టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పట్టణంలో ప్రచారం

సోంపేట: ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజుతో కలిసి పట్టణంలోని బీఎస్ కాలనీలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.

చంద్రబాబు బీసీల పక్షపాతి


శ్రీకాకుళం రూరల్: మాట్లాడుతున్న గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు బీసీల పక్షపాతి అని, బీసీ డిక్లరేషన్‌తో వైసీపీ నాయకుల్లో వణుకు మొదలైందని నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. శిలగాం, శింగువలస గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో బీసీలపై దాడులు, హత్యాకాండకు వైసీపీ ప్రభుత్వం పాల్పడిందని విమర్శించారు. టీడీపీ హయాంలో బీసీ, ఎస్సీ, మైనార్టీ కులాలకు రుణాలు మంజూరు చేసి, వారు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడిందన్నారు. రాష్ట్రం మళ్లీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేయాల్సి అవసరం ఉందన్నారు.

శిరీషను కలిసిన జనసేన నాయకులు

వజ్రపుకొత్తూరు: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీషను శుక్రవారం అమలపాడు పంచాయితీకి చెందిన జనసేన నాయకులు డీకే రామారావు మిత్ర బృందం మర్యాదపూర్వకంగా కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఉమ్మడి అభ్యర్థిగా శిరీష విజయానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దున్న డిల్లీరావు, దున్న పెంటారావు, అనిల్, పుచ్చ భీమారావు, జగదీష్, పాపారావు, వెంకటరమణ, వెంకటరావు, వెంకటేష్, తిరుపతిరావు, చిరంజీవి, వీరాస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

శిరీష గెలుపునకు కృషి

పలాస: తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గౌతు శిరీష గెలుపు కోసం కృషి చేస్తామని శ్రీశయన సంఘ నాయకులు రమణ, రాము స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో శిరీషను కలుసుకొని మద్దతు తెలిపారు. నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజల వద్దకు వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తామన్నారు. వీరితో పాటు మూర్తి, వెంకటేష్ పాల్గొన్నారు.

● రాష్ట్రంలో టీడీపీ ఎందుకు అధికారంలోకి రావాలో ప్రజలకు వివరిస్తామని టీఎస్ఎస్ఎస్ సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు పలాస అభ్యర్థి శిరీషను కలుసుకొని ప్రచారంలో తాము పాల్గొంటామని స్పష్టం చేశారు. శిరీషను కలుసుకున్న వారిలో బి.తారకేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సూపర్‌సిక్స్‌తో ప్రజలకు భరోసా

హరిపురం: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశపెడుతున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు భరోసానిస్తోందని పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. పొత్తంగి గ్రామంలో టీడీపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేగా శిరీష, ఎంపీగా రామ్మోహన్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొర్రాయి సూర్యనారాయణ, రట్టి లింగరాజు, నవీన్‌కుమార్, పత్రి లక్ష్మణరావు, బి.కృష్ణారావు, జగన్నాథం, కోన కృష్ణారావు, జేసి ఈశ్వరరావు, బి.కృష్ణారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ చేసిన అభివృద్ధి శూన్యం


టెక్కలి: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

టెక్కలి: గడచిన ఐదేళ్లలో వైసీపీ చేసిన అభివృద్ధి శూన్యమని, అందువల్లే తామంతా వైసీపీని విడిచి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్టు నందిగాం మండలం రౌతుపురం గ్రామానికి చెందిన పలువురు తెలిపారు. శుక్రవారం రాత్రి కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో రౌతుపురం గ్రామానికి చెందిన దిక్కల వెంకటేష్, సనపల వెంకటరమణ, బడ్డ కోదండ, బొడ్డ కృష్ణారావు, పురట చిన్నారావు, బెవర శంకరరావు, పోలాకి నర్సింహులు, బడియా నర్సింహమూర్తి, మల్ల రామారావు, రమణ, బడే భుజంగరావు, కొత్తపల్లి మల్లేశ్వరరావు తదితర 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నందిగాం మండల పార్టీ అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, రౌతుపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

● **టెక్కలి:** కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో దేవాది రాజు, దేవాది లచ్చుమయ్యలు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బోయిన రమేష్ పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రభుత్వంతోనే సంక్షేమం


జలుమూరు: పార్టీలోకి ఆహ్వానిస్తున్న బగ్గు రమణమూర్తి

జలుమూరు: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమం సాధ్యమని నరసన్నపేట నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. మండల కేంద్రమైన జలుమూరుతో పాటు కెల్లివానిపేట, కోనసింహాద్రిపేట, నామాలపేట, తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజానీకానికి వివరించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారిందన్నారు. సైకిలు గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కింజరాపు రామ్మోహన్‌నాయుడును గెలిపించాలని కోరారు. జలుమూరులో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి బగ్గ రమణమూర్తి కండువాలు వేసి పార్టీలో ఆహ్వానించారు. జలుమూరుకు చెందిన నామాన పార్వతీశం, కోలా వరప్రసాద్, ఆర్.సోమశేఖర్‌తో పాటు కెల్లివానిపేట, కోనసింహాద్రిపేటకు చెందిన వార్డు మెంబరు మెట్ట ఆనంద, బమ్మిడి దాలయ్య, మామిడి నారాయణ, వెంకటేష్ కుటుంబాలతో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ టీడీపీ అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు మునుకోటి దామోధరరావు, వైద్యభూషణ మురళీమోహనరావు, దత్తుబాబు, దుంగ స్వామిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాబును సీఎంగా చేద్దాం

నరసన్నపేట: టీడీపీ ఆవిర్భావం నుంచి అండగా ఉన్న జట్టు కళాసీ యూనియన్ నాయకులను ఉమ్మడి పార్టీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎంగా చేసేందుకు మరింత జట్టుగా పని చేయాలన్నారు. అనంతరం జట్టు కళాసీ యూనియన్ సభ్యులు రమణమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో గొద్దు చిట్టిబాబు, బెవర రాము, పల్లి శంకరరావు, కింజరాపు ముసలినాయుడు, టి.జనార్దనరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపు అనివార్యం


సమావేశంలో మాట్లాడుతున్న శేషగిరి

టెక్కలి: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కు వెళ్లిందని.. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం అనివార్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ ఐదేళ్లలో దాచుకోవడం, దోచుకోవడానికే పరిమితమైందన్నారు. ఆయనతో పాటు మండల టీడీపీ అధ్యక్షులు బగాది శేషగిరి, చాపర గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గార: గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 8వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వమరవల్లి బాలికల గురుకుల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వై.చిట్టితల్లి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన ఉంటుందన్నారు.

సంయమనం పాటించాలి

అరసవల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి ఏ క్షణమైనా పిలుపు వస్తుందని నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు సంయమనం పాటించాలని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ కోరారు. అరసవల్లిలో గల తన నివాసంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. మా కుటుంబంపై చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. క్రమశిక్షణ, నిబద్ధతో ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేశారని కొనియాడారు. గుండ దంపతుల నిర్ణయానికి తాము కట్టుబడి ఉన్నామని, పార్టీకి నియోజకవర్గంలో పూర్వవైభవం రావాలంటే మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి టికెట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, జామి భీమశంకర్, బుక్కా యుగంధర్, ఉంగటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పరమేశ్వరరావు

ఇచ్ఛాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురం వచ్చిన ఆయన లాలాపేట మసీదు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామన్నారు. పార్టీ కార్యకర్తలు, కేడర్ అంతా కష్టపడి పనిచేస్తే విజయం సాధించడం కష్టమేమీ కాదన్నారు. రాహుల్ గాంధీ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చక్రవర్తి రెడ్డి, నాయకులు అలీంఖాన్, యాదవ్, అన్నాజీరావు, సుదర్శన్‌రావు, మధు, శ్యాంసుందర్, తులసీరావు, పురుషోత్తం తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

గార: గార కూడలి వద్ద శుక్రవారం ఉదయం ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీను పట్టుకున్న ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శుక్రవారం శ్రీకాకుళం నగరానికి చెందిన గొంటు శ్రీనుబాబు, రేణుక దంపతులు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి లక్ష రూపాయలు ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి, అర్చకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమణయ్యరెడ్డి


రమణయ్యరెడ్డి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నందికి రమణయ్యరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కోర్టు బార్ చాంబర్‌లో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా రమణయ్యరెడ్డి, కార్యదర్శిగా ఎన్‌వీఎస్ రంగారావు, ట్రెజరర్‌గా ఆర్.దేవరాజ్‌రెడ్డి ఎన్నికయ్యారు. 2024-25 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఉంటుందని సీనియర్ న్యాయవాది దక్కత కృష్ణమూర్తిరెడ్డి, న్యాయవాదులు తెలిపారు. ఈ మేరకు నూతన కార్యవర్గానికి పూలగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా

ఆమదాలవలస: కాంగ్రెస్ పార్టీ గెలుపుతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రత్యేకహోదాతోపాటు పోలవరానికి నిధులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడం, విశాఖ రైల్వేజోన్, వెనుకబడిన ఉత్తరాంధ్రాకు ప్రత్యేక ప్యాకేజీ కల్పిస్తారన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.5 వేలు, 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్, ప్రతి ఇంటికి రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతి రైతుకు రుణమాఫీ ఉంటుందన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్ఛాపురం, రూరల్, కవిటి ఎస్ఐలతో సమీక్షించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణరావు, రాము పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ పునర్నిర్మాణ ఉత్సవాలు

ఎచ్చెర్ల: ఫరీద్‌పేటలో ఎంతో విశిష్టత కలిగిన రంగనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణ ఉత్సవాలు ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు పైడి రంగనాథం, పైడి రాములు, సూర శ్యామలరావు, పైడి నాగేశ్వరరావు, పైడి ముఖలింగం తెలిపారు. ఆలయ ఆవరణలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. 1974లో లక్ష్మీనారాయణ రామానుజ స్వామిచే నిర్మించిన ఈ ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో.. చినజీయర్ స్వామి సూచనలతో గ్రామస్థులు, దాతల సహకారంతో పునర్నిర్మాణ చేపట్టామన్నారు. శ్రీరంగంలోని రంగనాథ స్వామిని పోలిన శేషపాన్పుపై ఉన్న ప్రణవాకారంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 31న మూలవిరాట్‌ను గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. చిన జీయర్ స్వామి, అహోబిల రామానుజీయర్‌స్వామి ఆధ్వర్యంలో వచ్చే నెల 4వ తేదీ ఉదయం 11.42 గంటలకు మూల విరాట్ ప్రతిష్ఠోత్సవం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోటిపాత్రుని హరికృష్ణ, పైడి వేణు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గార: సిమ్మపేట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న అంబటి గోవిందరావును శుక్రవారం సాయంత్రం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పరామర్శించారు. ఇదే గ్రామంలో ఇటీవల చనిపోయిన వారి రెండు కుటుంబాలను పరామర్శించారు.


నరసన్నపేట: పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న బగ్గు రమణమూర్తి


పలాస: తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న గౌతు శివాజీ తదితరులు


సోంపేట: కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే అశోక్, టీడీపీ శ్రేణులు


హరిపురం: టీడీపీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


ఎల్ఎన్‌పేట: టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

బడుగు వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్

● ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

బడుగువర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ ఎన్టీఆర్ అని టీడీపీ నేతలు కీర్తించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ, మండల కేంద్రాలలో టీడీపీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టెక్కలిలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు: టీడీపీ ఆవిర్భావ వేడుకలలో నాయకులు


కొత్తూరు: టీడీపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు


ఆమదాలవలస: పార్టీ జెండాను ఎగురవేస్తున్న టీడీపీ నాయకులు


అరసవల్లి: జిల్లా పార్టీ కార్యాలయం వద్ద..


గార: గారలో ఎన్టీఆర్ చిత్ర పటం వద్ద నివాళులు


హిరమండలంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన దృశ్యం


కంచిలి: కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


ఇచ్ఛాపురం: పార్టీ కార్యాలయంలో..


ఎచ్చెర్ల: పార్టీ కార్యాలయం వద్ద..


సంతబొమ్మాళిలో జెండాను ఎగురవేసిన నాయకులు


ఆనందపురం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్

ఓటర్లకు అసౌకర్యం కలగకూడదు

నందిగాం: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని టెక్కలి సబ్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నూరుల్ ఖమర్ సూచించారు. శుక్రవారం మండలంలోని సెక్టర్-5, 6 పరిధిలోని పెద్దలవునిపల్లి, కామధేనువు, హరిదాసుపురం, ఆనందపురం, సవరబాణాపురం, మాదిగాపురం, బోరుభద్ర, లట్టిగాం, కొండతెంబూరు, దేవుపురం, చిన్నలవునిపల్లి, కాపుతెంబూరు, సింగుపురం, మజ్జిగోపాలపురంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు ఉండేలా మరోమారు పరిశీలించాలన్నారు. ఓటర్లలో మరింత చైతన్యం నింపి పోలింగ్‌శాతం పెంచాలన్నారు. ఈ పరిశీలనలో ఎంసీసీ అధికారి జి.శివప్రసాద్, తహసీల్దార్ వి.పద్మావతి, సెక్టార్ అధికారులు బి.అభిషేక్, మోహనరావు, ఆర్ఐ కిరణ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

నందిగాం: ఓటుహక్కును సద్వినియోగపర్చుకోవాలని వెలుగు ఏపీఎం కె.జాంబవతి అన్నారు. శుక్రవారం మండలంలోని కాపుతెంబూరు, హరిదాసుపురం, పీపీపురం, దేవళభద్ర గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ, సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు దమయంతి, కార్యదర్శులు, బీఎల్‌వోలు, బీవోఏలు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురికావద్దు..

పాతపట్నం: ఓటు హక్కు వినియోగంలో ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని వెలుగు ఏపీఎం మనోరత్నం అన్నారు. చంగుడిగ్రామంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఓటు ఆవశ్యకతను వివరిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ మీనాక్షి, వీఓఏఎస్ జోగారావు, సచివాలయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నరసన్నపేట: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ లోకేష్ అన్నారు. శుక్రవారం అంబాజీపేటలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్వాక్రా మహిళలు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.


నందిగాం: దేవళభద్రలో అవగాహన ర్యాలీ...


పాతపట్నం: చంగుడిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


కాలువలో పూడికలు తీస్తున్న పారిశుధ్య సిబ్బంది..

కాలువలో పూడిక తీత

పలాస: స్థానిక కేటీరోడ్డు టెలికాం కార్యాలయం రోడ్డులో కాలువ పూడుకుపోయి పది రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ చొరవ తీసుకొని సిబ్బంది, ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువపై ఉన్న కాంక్రీట్ దిమ్మలను తొలగించి పూడికలు తీయించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ శివకుమార్ తెలిపారు. పిన్నింటిపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తుండడంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఏఈ కోరారు.

ప్రమాదాల మలుపులు

పలాస రూరల్: పలాస మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో జంగిల్ క్లియరెన్స్ లేకపోవడం... మలుపులు అధికంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మాకన్నపల్లి నుంచి బొడ్డపాడు మీదుగా గరుడభద్ర గ్రామం వరకూ.. మాకన్నపల్లి నుంచి జాతీయ రహదారి మీదుగా వెళ్లే రహదారిలో ఇరువైపులా పిచ్చిమొక్కలు అధికంగా పెరగడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అదేవిధంగా లొద్దభద్ర నుంచి సవరగోవిందపురం గ్రామానికి వెళ్లే రహదారిలో అధికంగా మలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి... మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



మాకన్నపల్లి నుంచి జాతీయ రహదారికి వెళ్లే దారిలో పిచ్చిమొక్కలు, లొద్దభద్ర-సవరగోవిందపురం వెళ్లే దారిలో ప్రమాదకర మలుపు

సైకో పాలన పోయి.. సైకిల్ పాలన రావాలి

పలాస రూరల్: సైకో పాలన పోయి.. సైకిల్ పాలన రావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస మండలం రెంటికోట, పెదంచల గ్రామాల్లో శుక్రవారం ప్రజాగళం యాత్రలో పాల్గొని ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు పథకాలను వివరించారు. ప్రస్తుత వైసీపీ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని, మళ్లీ టీడీపీ పాలన వస్తేనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, కుత్తుమ లక్ష్మణ్, దువ్వాడ సంతోష్, హోరియా మోహనరావు, కిక్కర డిల్లీరావు, ఎం.కమలమ్మ, వంకల కూర్మారావు పాల్గొన్నారు.


రెంటికోటలో ప్రచారంలో పాల్గొన్న శిరీష

చంద్రబాబు పిలిస్తే వెళతా: కలమట

మెళియాపుట్టి: టీడీపీ అధినేత చంద్రబాబు పిలిస్తే తాను వెళతానని... ఇక్కడ జరిగిన పరిణామాలు తెలియజేస్తానని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి తెలిపారు. శుక్రవారం తన అనుచరులతో మెళియాపుట్టి నుంచి చాపర వరకు ర్యాలీ నిర్వహించారు. తనను కాదని వేరే వాళ్లకు టిక్కెట్ ప్రకటించడం బాధగా ఉందన్నారు. ప్రతి మండలంలో తన ఆత్మీయులతో సమావేశాలు ఏర్పాటు చేసి...అభిప్రాయాలు సేకరిస్తున్నానని తెలిపారు. మళ్లీ టీడీపీ జెండా ఎగురవేయాలంటే కలమట కుటుంబానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలమట సాగర్, లచ్చనయ్య, భాస్కర్‌గౌడో, వసంత్, లలిత కుమారి పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న కలమట

అక్రమ మద్యం స్వాధీనం

మెళియాపుట్టి: ఒడిశాలోని పర్లాఖిముడి నుంచి ఆటోలో అక్రమంగా 42 మద్యం సీసాలు తరలిస్తుండగా శుక్రవారం సిరిఖండి వద్ద ప్రత్యేక బృందం పట్టుకుందని ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. వీటి విలువ రూ.13,250 ఉంటుందన్నారు. ఆటో డ్రైవర్ పడాల కృష్ణారావు, జన్ని గంగాధర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్ టీమ్ సభ్యులు పైల శివరామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మద్యం సీసాలను పరిశీలిస్తున్న పోలీసులు

జ్ఞానజ్యోతిలో ఫేర్‌వెల్ డే

నరసన్నపేట: స్థానిక జ్ఞానజ్యోతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డేని ఘనంగా నిర్వహించారు. రిటైర్డు ఆర్ఐవో ఎస్.రుక్మాంగధరరావు, ప్రిన్సిపాల్ అసిరినాయుడు, మేనేజ్‌మెంట్ సభ్యులు మత్స నిరంజన్, గొండు రంగారావు, ఇంటర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రమీల, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

పారశెల్లిలో ఆలయ ప్రతిష్ఠ

నరసన్నపేట: పారశెల్లి గ్రామంలో జలభవానీ సహిత కేదారీశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.


ఆలయ ప్రతిష్ఠోత్సవంలో భాగంగా పూజల్లో పాల్గొన్న స్థానికులు

పట్టు పరిశ్రమ భూముల ఆక్రమణలపై చర్యలేవీ?

● స్థలాలను పరిశీలించిన ప్రజా సంఘాలు, కాంగ్రెస్ నాయకులు

హరిపురం: మందస పట్టు పరిశ్రమ భూముల ఆక్రమణలపై అధికారులు తీసుకున్న చర్యలేంటని ప్రజాసంఘాలు, కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. మందస మండలం చీపి రోడ్డులోని గురుకుల ఆశ్రమ పాఠశాల పక్కనే ఉన్న ఆక్రమిత భూములను శుక్రవారం ఆ సంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందస తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న భూములు ఆక్రమణకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. ఈ భూముల్లో కంకర తవ్వి... అమ్ముకున్నారని, కొత్తగా మొక్కలు వేసి ఆక్రమణదారులు ఫామ్‌హౌస్‌లు నిర్మించారని ఆరోపించారు. వీటన్నింటికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడం మరింత విడ్డూరమని అన్నారు. భూములను సంరక్షించపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.మోహనరావు, పౌరహక్కుల సంఘ నాయకులు సోమనాథం, గిరిజన సంఘ నాయకులు సవర ఫాల్గుణరావు, సవర గురునాథ్, సవర నర్సింగులు, కాంగ్రెస్ నాయకులు మజ్జి త్రినాథ్‌బాబు, కొర్ల హేమరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న ప్రజా సంఘాలు, కాంగ్రెస్ నాయకులు